

న్యూ ఇయర్ సందడి



కలెక్టర్ హిమాన్షు శుక్లాకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్పీ శ్రీధర్





కలెక్టర్ హిమాన్షు శుక్లాకు పుస్తకాలు అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ నుపూర్‌అజయ్, పంచాయతీరాజ్ అధికారులు

అమలాపురం, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లావ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. పరిధిలోని అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులకు ప్రజలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పలుచోట్ల అధికారులు, ప్రజాప్రతినిధులు అభిమానుల సమక్షంలో కేక్‌లు కట్ చేశారు. మర్యాదపూర్వకంగా పుష్పగుచ్ఛాలు, స్వీట్లు, మిఠాయిలు అందజేసి శాలువాలతో సన్మానించారు. కొంకాపల్లిలోని బంగ్లాలోను, కలెక్టరేట్‌లోను జరిగిన న్యూ ఇయర్ వేడుకల్లో కలెక్టర్ హిమాన్షు శుక్లా పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, పరిపాలనాధికారి విశ్వేశ్వరరావుతో పాటు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అధికారులు కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసారి కలెక్టర్ న్యూ ఇయర్‌ను భిన్నంగా నిర్వహించారు. తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చేవారంతా సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థుల ప్రయోజనార్థం ఇంగ్లిషు, తెలుగు డిక్షనరీలు, గ్రామర్ పుస్తకాలు, వివిధ కాంపిటేటీవ్ పరీక్షలకు సంబంధించిన పబ్లికేషన్స్, క్విక్ కాంపిటీషన్ మ్యాథమెటిక్స్ సహా వివిధ మ్యాగజైన్లను తీసుకురావాలని సూచించారు. దీంతో అధికారులు, ఇతర సిబ్బంది వాటిని తీసుకుని కలెక్టర్ శుక్లాకు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇలా వచ్చిన పుస్తకాలను ర్యాక్‌ల్లో భద్రపరిచారు. వాటిని జిల్లాలోని 55 సంక్షేమ వసతిగృహాలకు మంగళవారం పంపిణీ చేస్తామని తెలిపారు. కలెక్టర్‌కు జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి లక్ష్మీనారాయణరెడ్డి, డీఎల్‌పీఆర్వో రామిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

టీడీపీ ఆధ్వర్యంలో..

మాజీ ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, చిల్లా జగదీశ్వరి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, మాజీ ఎంపీ ఏజేవీబీ మహేశ్వరరావు, ఆయన కుమార్తె స్వతశ్రీలను వారి వారి స్వగృహాల్లో టీడీపీ నాయకులు పెద్ద సంఖ్యలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రమణబాబుకు మాజీ ఎమ్మెల్యేలు ఆనందరావు, జగదీశ్వరి రమణబాబుకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేయించారు. టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ సోంబాబు, అధికార ప్రతినిధి నల్లా స్వామి, తెలుగు మహిళ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెచ్చెట్టి విజయలక్ష్మి, అధికారి జయవెంకటలక్ష్మి, పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఆనందరావుకు బండారులంకకు చెందిన టీడీపీ నేతలు చింతా శంకరమూర్తి, పిచ్చిక శ్యామ్, మాడా మాధవి, ఆ గ్రామానికి చెందిన నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.



టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనందరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు





కాంగ్రెస్ నాయకుల సమక్షంలో కేక్ కట్ చేస్తున్న పీసీసీ చీఫ్ గిడుగు రుద్రరాజు, మంత్రి విశ్వరూప్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

పీసీసీ చీఫ్ గిడుగు రుద్రరాజు కార్యాలయానికి పార్టీలకు అతీతంగా పెద్ద సంఖ్యలో నాయకులు వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, వివిధ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, రాష్ట్రంలోని వివిధ జిల్లాల అధ్యక్షులు, నాయకులు కొత్తూరి శ్రీనివాస్, అయితాబత్తుల సుభాషిణి, చీకట్ల అబ్బాయి, వంటెద్దు బాబీ, మహ్మద్ ఆరిఫ్, కుడుపూడి శ్రీనివాసరావు, యార్లగడ్డ రవీంద్ర, షకీలా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వివిధ మతాల పెద్దలు కూడా రుద్రరాజును కలిసి ప్రార్థనలు చేసి శుభాకాంక్షలు చెప్పారు.

మంత్రి విశ్వరూప్, మీనాక్షి దంపతులతో పాటు వారి తనయుడు శ్రీకాంత్ కేక్‌లు కట్ చేసి వైసీపీ కార్యకర్తలకు పంచారు. రెవెన్యూ, పోలీసులతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్సీ, శెట్టిబలిజ నాయకుడు కుడుపూడి సూర్యనారాయణరావును వైసీపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ రెడ్డి సత్యనాగేంద్రమణి పుట్టినరోజు వేడుకలను ఆ పార్టీ కౌన్సిలర్లు ఘనంగా నిర్వహించారు. వైసీపీ నాయకులు కేక్‌లు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

ఎస్పీ కార్యాలయంలో...

ఎస్పీ క్యాంపు కార్యాలయంలో పోలీసు అధికారులు న్యూ ఇయర్‌ను వేడుకగా నిర్వహించారు. జిల్లా పరిధిలోని పోలీసు అధికారులు వచ్చి ఎస్పీ శ్రీధర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు అధికారులు ఎస్పీకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అడ్మిన్ ఎస్పీ ఖాదర్‌బాషా, డీఎస్పీలు అంబికాప్రసాద్, కేవీ రమణ, ప్రసాద్, పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు. ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి సిబ్బంది వరకు ఎస్పీకి శుభాకాంక్షలు తెలిపారు. అమలాపురం డీఎస్పీ అంబికాప్రసాద్, సీఐ టి.క్రాంతికుమార్‌లకు పోలీసులు శుభాకాంక్షలు తెలిపారు.

జనసేన నాయకులకు శుభాకాంక్షలు...

జనసేన అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డీఎంఆర్ శేఖర్, అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి శెట్టిబత్తుల రాజబాబులకు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

వాడపల్లికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం, జనవరి 1: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామిని సోమవారం వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు దర్శించుకున్నారు. ఆంగ్ల నూతన సంవత్సరం కావడంతో ఆలయాన్ని ఫల, పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. ఫొటో షూట్ వద్ద భక్తుల సందడి నెలకొంది. అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ధర్మకర్తల మండలి సభ్యులు స్వామివారిని దర్శించుకుని ఏర్పాట్లను పర్యవేక్షించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,09,958 లభించినట్టు ఈవో చెప్పారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి గుండుగొలనకు చెందిన బ్రహ్మార గౌరేశ్వరరావు-లక్ష్మి దంపతులు రూ.50వేలు విరాళం సమర్పించారు. దాతకు స్వామివారి చిత్రపటం అందజేశారు.



వేంకటేశ్వరస్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

సీఎం జగన్‌కు మారు మనసు ప్రసాదించండి

▸▸ ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీల ప్రార్థనలు

అమలాపురం టౌన్, జనవరి 1: సీఎం జగన్‌కు మారు మనసును ప్రసాదించుము నాయనా... ఆయన పాషాణ హృదయాన్ని కరగదీయుము తండ్రీ... అంటూ అంగన్‌వాడీలు ఐసీడీఎస్ అమలాపురం ప్రాజెక్టు కార్యాలయం ఎదుట సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కుటుంబ సభ్యులకు, సంఘానికి దూరంగా నూతన సంవత్సరం జరుపుకోవాల్సిన పరిస్థితి తీసుకువచ్చారు.. నడి రోడ్డుపై పండుగ చేసుకుంటున్నాం... ఆశ కొద్దీ కాదు మా అవసరాల కొద్దీ అడుగుతున్నాం... మా జీతాలు పెరిగేలా, మా గ్రాట్యుటీ పెరిగేలా సీఎం జగన్ మనసు మార్చు తండ్రీ అని కన్నీటి పర్యంతమై ప్రార్థించారు. మా దుఃఖాన్ని చూడుము తండ్రీ అంటూ... మా అవసరాల కోసం మేము నిలబడి ఉన్నాము తండ్రీ.... జగన్ మాకిచ్చిన హామీలను అమలు చేయమని ఆదేశించుము తండ్రీ... అని వేడుకున్నారు. 21 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా ఆయన మనసు కరగడం లేదు. మీ దివ్యమైన ఆశీస్సులు మాకు అందించి అతని మనసు మార్చుము అని వేడుకున్నారు. 21వ రోజు సమ్మె శిబిరాన్ని జిల్లా కోశాధికారి పి.అమూల్య, ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు కె.బేబీగంగారత్నం, విజయ, దైవకృప, సీత ఆధ్వర్యంలో నిర్వహించారు. సీఐటీయూ నాయకులు కారెం వెంకటేశ్వరరావు, గుడే దుర్గాప్రసాద్ తదితరులు సందర్శించి సంఘీభావం తెలిపారు. దీక్షలో నవీమి, రత్నకుమారి, కనకమహాలక్ష్మి, రుక్మిణి అధిక సంఖ్యలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు. అనంతరం నూతన సంవత్సర కేక్ కట్ చేశారు.



ఐసీడీఎస్ అమలాపురం ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ప్రార్థన చేస్తున్న అంగన్‌వాడీలు



కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరంలో సమగ్ర శిక్షా ఉద్యోగులు

సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

13వ రోజుకు కలెక్టరేట్ ఎదుట దీక్షా శిబిరం

అమలాపురం టౌన్, జనవరి 1: సమగ్ర శిక్షాలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను విద్యా శాఖలో విలీనం చేసి అందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండు చేస్తూ ఏపీ సమగ్ర శిక్షా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట దీక్షా శిబిరం నిర్వహించారు. హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని నినాదాలతో హోరెత్తించారు. పాదయాత్రలో భాగంగా జగన్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండు చేశారు. 13వ రోజుకు చేరుకున్న సమ్మె శిబిరంలో వివిధ విభాగాల అధ్యక్షులు బత్తుల శ్రీనివాస్, భువనేశ్వరి, కె.వెంకట్, గుంట్రు సత్యనారాయణ, ఎ.శారదాకృష్ణ, ఎన్.శ్రీనుబాబు, నామాడి వెంకట్, గూటం నాగన్న, నూకపెయ్యి గంగాధరరావు, గౌతమ్, కేతా వెంకటేశ్వరరావు, సునీత, మోర్త శ్రీనివాసరావు, పి.రవికుమార్, పి.సునీత, వందలాది మంది ఉద్యోగులు పాల్గొని ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. శిబిరాన్ని ఫ్యాప్టో జిల్లా శాఖ అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్, ఎస్టీయూ జిల్లా, మండల సంఘాల నాయకులు పోతంశెట్టి దొరబాబు, సరిదే సత్యపల్లంరాజు, జీవీవీ సత్యనారాయణ, సీహెచ్ సుధీర్, ఎస్ఎస్ ప్రకాశరావు, చిక్కం మైనరుబాబు, నల్లా రామకృష్ణ, యూటీఎఫ్ అధ్యక్షుడు తరపట్ల దుర్గాప్రసాద్, ఎంఎస్ నారాయణ సందర్శించి సంఘీభావం తెలిపారు. సమగ్ర శిక్షా ఉద్యోగులకు పూర్తి అండగా ఉంటామని, వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండు చేశారు. ఎస్టీయూ అమలాపురం మండల శాఖ సమ్మె శిబిరానికి సంఘీభావం తెలిపి రూ.6వేలు ఆర్థిక సాయం అందించింది.

ఆస్పత్రిపాలైన ఆయా... ఉద్యోగ భద్రతపై ఆందోళన

▸▸ అపస్మారక స్థితి.. విషమంగా ఆరోగ్యం.. 12లో

పాలకుల మంకుపట్టుతో

పౌష్టికాహారం ఎలుకల పాలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో కుళ్లుతున్న గుడ్ల నుంచి దుర్వాసన

ఇతర ఆహార పదార్థాలపై ముసురుకుంటున్న ఈగలు

చిన్నారుల ఆరోగ్యానికి ప్రమాదం

అంగన్‌వాడీల సమ్మెపై స్పందించని ప్రభుత్వం

చిన్నారులకు, బాలింతలకు అందని బలవర్ధక ఆహారం



మామిడికుదురులో ప్రభుత్వ చీరలకు పూజలు చేస్తూ నిరసన

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఎంత మంది ఇబ్బంది పడినా మా మంకుపట్టు మాదే అంటే పాలకులు బెట్టు వీడడం లేదు. చివరికి గర్భిణులు, బాలింతలు, చిన్నారుల పౌష్టికాహారంతో ముడిపడి ఉన్న విషయంలోనూ ప్రభుత్వం కాలయాపననే నమ్ముకోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నా అవేమి పట్టించుకోవడం లేదు. అంగన్వాడీలు 19 రోజులుగా తమ డిమాండ్ల సాధనకు పోరాడుతున్నారు. గత ఎన్నికల వేళ అక్కచెల్లెమ్మలంటూ ప్రేమ ఒలకబోసిన సీఎం జగన్ ఇప్పుడు అంగన్వాడీ మహిళలను ముప్పుతిప్పలు పెడుతున్నారు. అంగన్వాడీల సమ్మెతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందడంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయనే స్పృహ కూడా ప్రభుత్వానికి లేకుండా పోయింది. లబ్ధిదారులు అంగన్వాడీలకే మద్దతు పలుకుతున్నా పాలకులకు మాత్రం వారి సమస్యలు కానరావడం లేదు. దీంతో పౌష్టికాహారం ఎలకలపాలవుతోంది. అంగన్వాడీలను భయపెట్టడానికి వలంటీర్లు, సచివాలయ సిబ్బందిని అంగన్వాడీ సెంటర్లకు పంపిస్తున్నా ఎటువంటి ప్రయోజనం కనిపించడం లేదు. 19 రోజులుగా సెంటర్లకు గర్భిణులు, బాలింతలు, పిల్లలు రావడం లేదు. ప్రభుత్వ తీరుపై అవగాహన చేసుకోలేని వయసులో ఉన్న పిల్లలు అంగన్వాడీ కేంద్రాలకు తీసుకెళ్లాలని మారాం చేస్తున్నారు. ఓ కానిస్టేబుల్‌కి కూడా ఈ పరిస్థితి ఎదురైంది. అంగన్వాడీ వర్కర్లు, ఆయాలు ఉన్నప్పుడు లబ్ధిదారులకు అందాల్సిన పౌష్టికాహారాన్ని నిర్దేశిత సమయం ప్రకారం అందజేసేవారు. ఇప్పుడు ఆ క్రమం తప్పింది. కేంద్రాల్లో మిగిలిన/కొత్తగా వచ్చిన గుడ్లు కుళ్లిపోయి దుర్వాసన వస్తోంది. ఈగలు విపరీతంగా ముసురుకుంటున్నాయి. ఈ ప్రభుత్వం వచ్చాక అంగన్వాడీ కేంద్రాలను ప్రాథమిక పాఠశాలలకు తరలించారు. దీంతో ఆ పాఠశాలల్లోని పిల్లలకు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఏర్పడింది. కందిపప్పు, బాలసంజీవిని, పల్లీల అచ్చులను ఎలుకలు ఎంచక్కా ఆరగిస్తున్నాయి. ఈ నెలలో మొదటి ఫేజ్‌లో వచ్చిన సరుకులను లబ్ధిదారులకు అంగన్వాడీలు అందజేసిన అనంతరం సమ్మెలో దిగారు. రెండో ఫేజు సరుకుల పంపిణీ తారుమారైంది. అంగన్వాడీ కేంద్రాలను ఇప్పుడు కనీసం శుభ్రం కూడా చేయడం లేదు. వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో ప్రభుత్వం కేంద్రాల తాళాలను బద్దలు కొట్టించింది. కానీ, వాటికి కొత్త తాళాలు లేక ప్రస్తుతం అధిక శాతం కేంద్రాలకు తాళాలు వేయడం లేదు. దీంతో కేంద్రాల్లోని ఆట వస్తువులు, ఫర్నీచర్ వంటివి దొంగలపాలు అవుతాయని అంగన్వాడీలు ఆవేదన చెందుతున్నారు. 2020లో తాము సొంత డబ్బుతో తయారు చేసిన ప్రీస్కూల్ కిట్లు, ఆటపాట వస్తువులు సెంటర్లలో ఉన్నాయని చెబుతున్నారు. కాగా.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సుమారు 5000 అంగన్‌వాడీ సెంటర్లు ఉండగా తూర్పుగోదావరి జిల్లాలో 1556 సెంటర్లు ఉన్నాయి. ఏడెనిమిది నెలల నుంచీ గ్యాస్ సిలిండర్ల బిల్లులు కూడా అంగన్వాడీలకు చెల్లించడం లేదు.

● పౌష్టికాహారం ఇలా

గర్భిణులు, బాలింతలకు నెలలోని 1 నుంచి 6వ తేదీ వరకూ మొదటి విడత, 10-20లోపు రెండో, 20-31లోపు మూడో విడత కింద 1-15వ తేదీలోపు ఒక్కొక్కరికి 13 గుడ్లు, రెండున్నర లీటర్ల పాలు, బాలసంజీవిని కిట్ (కర్జూరం 250 గ్రా, బెల్లం 250 గ్రా, పల్లీల అచ్చు 250 గ్రా, రాగిపిండి 2 కిలోలు, అటుకులు 1కిలో), బియ్యం 3 కిలోలు, కందిపప్పు కిలో, వంటనూనె అర లీటరు. రెండో విడత పంపిణీ కింద 16-30వ తేదీలోపు 12 గుడ్లు, రెండున్నర లీటర్ల పాలు ఇస్తారు. మొత్తంగా నెలకు బాల సంజీవిని కిట్ 1, ఎగ్స్ 25, పాలు 5 లీటర్లు రైస్ 3 కిలోలు, కందిపప్పు కిలో, వంటనూనె అరలీటరు అందజేస్తారు. 6 నెలల నుంచి 3 ఏళ్లలోపు పిల్లలకు నెలకు 25 గుడ్లు, రెండున్నర లీటర్ల పాలు, బాలామృతం ప్యాకెట్ ఇస్తారు. 3-5 ఏళ్లలోపు ప్రీస్కూల్ పిల్లలకు రోజూ గుడ్డు, పప్పుతో భోజనం, 100 మిల్లీ లీటర్ల పాలు ఇస్తారు.

సీఎం, మంత్రుల పేర్ల మంత్రాలతో

అంగన్‌వాడీల పూజలు

● నాసిరకం చీరల ప్రదర్శన

● పి.గన్నవరంలో వినూత్న నిరసన



మంత్రాలతో పూజలు చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

పి.గన్నవరం, జనవరి 1: ఓం జగన్మోహరెడ్డి నమః, ఓం బొత్సాయన నమః, ఓం సజ్జల రామకృష్ణారెడ్డి నమః, తాడేపల్లి ప్యాలెస్ నమః, ఆకలి మంటాయ నమః అంటూ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో అంగన్‌వాడీలు వినూత్నంగా చీరలు, సెల్‌ఫోన్లకు పసుపు, కుంకుమతో పూజలు నిర్వహించారు. అనంతరం ప్రభుత్వం అందించిన నాసిరకం చీరలను ప్రదర్శించారు. పి.గన్నవరం-నరేంద్రపురం రోడ్డు మధ్యలో కేక్ కట్ చేసి నిరసన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విప్లవ గీతాలు ఆలపిస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్‌వాడీల నిరవధిక సమ్మెకు ఎస్టీయూ మండల శాఖ నాయకులు సంఘీభావం తెలిపారు. జిల్లా అంగన్‌వాడీ వర్కర్లు, సహాయకుల అధ్యక్షురాలు బండి వెంకటలక్ష్మి, కె.నాగలక్ష్మి, మట్టపర్తి వెంకటలక్ష్మి, లక్ష్మీకుమారి, కె.కిరణ్మయి, జి.వెంకటరమణ, జె.పద్మమాల, డి.లలిత, కె.వెంకటలక్ష్మి, వరహాలక్ష్మి, అత్తిలి ఉమాశంకరి, జెహార బేబిఆశాలత, ఎన్.మీనాక్షి, కె.గంగారత్నం తదితరులు పాల్గొన్నారు.



నాసిరకం చీరలను ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కోడి పందేల శిబిరంపై పోలీసుల దాడులు

ఎటపాక, జనవరి 1: నూతన సంవత్సరం సందర్భంగా కోడి పందేలు నిర్వహిస్తున్న స్థావరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. గొమ్ముకొత్తగూడెం పంచాయతీ పరిధిలోని ఎర్రబోరు గ్రామ శివారు ప్రాంతంలో కోడి పందేల బరి నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దాంతో పోలీసులు బరి ఏర్పాటు చేసిన ప్రాంతంలో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, రెండు పందేం కోళ్లతో పాటు రూ.1200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ కె.పార్థసారథి తెలిపారు. సంక్రాంతి పండుగ పేరుతో కోడి పందేలు, జూదాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ పార్థసారథి హెచ్చరించారు.

జనసంచారంలోకి మొసలి పిల్ల



మోతుగూడెం, జనవరి1: చింతూరు మండలం మోతుగూడెం జగదాంబ సెంటర్లో జన సంచారంలోకి మొసలి పిల్ల రావడంతో గ్రామస్థులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. జగదాంబ సెంటర్ కాలనీ వాసులు ఫారెస్ట్ అధికారులకు ఫోన్ చేయడంతో ఫారెస్ట్ అధికారులు దానిని పట్టుకుని పెద్దవాగులో వదిలేశారు.

లారీ ఢీకొని యువకుడి మృతి



రోడ్డుపై పడి ఉన్న క్షతగాత్రులు

జగ్గంపేట, జనవరి 1: కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. రామవరం గ్రామానికి చెందిన కొండేపూడి నవీన్, కల్యాణం చిన్న, సింగర్ల మహేష్‌బాబు స్థానిక ముమ్మిడివరపు నారయ్య సప్లయ్ కంపెనీలో పనిచేస్తున్నారు. కంపెనీలో జరిగే నూతన సంవత్సర వేడుకల కోసం నవీన్ మిగిలిన ఇద్దరితో కలిసి మోటారు సైకిల్‌పై జగ్గంపేటకు బిర్యానీ పార్శిల్ కోసం బయలుదేరారు. రాజమండ్రి నుంచి విశాఖ వైపు వెళ్తున్న లారీ ఢీ కొనడంతో వారు రోడ్డుపై పడ్డారు. నవీన్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే చనిపోయాడు. ఈ కేసును జగ్గంపేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



శీతాకాలం సోయగాలు

కడియం, జనవరి 1: శీతాకాలం వచ్చిందంటే చాలు కడియం నర్సరీల్లో రకరకాల సీజనల్ పుష్పాలు కనువిందు చేస్తాయి. ఈ కాలంలో చలి పెరిగే కొద్దీ మొక్కలు మరింత ఆకర్షణీయంగా పెరుగుతాయి. మొక్కలపై మక్కువ ఉన్న వన ప్రేమికులు ఈ కాలంలో సీజనల్ పుష్పాలు పెంచడానికే ఎక్కువ ఆసక్తి కనబరుస్తారు. బంతి, చామంతి, వింకారోజ్, డైజీ, డయాంతస్, జెనియా, పిటోనియా, డస్టిమిల్లర్, గజేనియా, క్రిసాంతిమం, స్ట్రాబెర్రీ, మినీడాలియా, సాల్వియా తదితర రకరకాల సీజనల్ పూలు శీతకాలంలో కనువిందు చేస్తాయి. కొద్దిపాటి జాగా ఉన్న ఇంటి పెరటిలోను, ఇంటిలోపల టీవీ, టీపాయ్ వంటి వాటిపైన, మరికొంత మంది హేంగింగ్ పాట్స్‌గాను ఈ మొక్కలను పెంచుతుంటారు. నర్సరీ రైతులు సెప్టెంబరులో ఈ సీజనల్ పుష్పాలు పెంచడం ప్రారంభిస్తారు. ఈ పుష్పాలు నవంబరు మాసం నుంచి ఫిబ్రవరి వరకు ఉంటాయి. ఈ సీజన్‌లోనే క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి, మహాశివరాత్రి వంటి పండుగలు రావడం, నర్సరీలను తిలకించేందుకు నర్సరీలకు సందర్శకుల తాకిడి ఉండటంతో ప్రతి నర్సరీలోను రైతులు సీజనల్ పుష్పాల పెంపకంపై దృష్టి సారిస్తారు.

వారి కులంపై లోతుగా విచారణ జరపండి

సహేతుక సమయంలో ఉత్తర్వులివ్వండి

నిర్దిష్ట నిర్ణయం ఎందుకు చెప్పలేదు?

దళితులకు శిరోముండనం కేసులో

కలెక్టర్ తీరుపై హైకోర్టు ఆగ్రహం

అమరావతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): శిరోముండనం కేసులో బాధితులు కోటి చినరాజు, డి.వెంకటరమణ ఫలానా కులం వారని కలెక్టర్ నిర్దిష్ట నిర్ణయాన్ని వెల్లడించకపోవడంపై హైకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. వారి కులం వ్యవహారంలో తాజాగా లోతైన విచారణ జరిపి చట్టనిబంధనల మేరకు తగిన ఉత్తర్వులు జారీ చేయాలని కాకినాడ జిల్లా కలెక్టర్, జిల్లా స్థాయి స్క్రూటినీ కమిటీ చైర్మన్(జాయింట్ కలెక్టర్)ను ఆదేశించింది. బాధితుల కుల ధ్రువీకరణ పత్రం విషయంలో జిల్లా కలెక్టర్ 2019 జూన్ 11న జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేసింది. మరోసారి కుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకునేందుకు బాధితులకు వెసులుబాటు కల్పించింది. వారి దరఖాస్తులపై సహేతుక సమయంలో నిర్ణయాన్ని వెల్లడించాలని జిల్లా కలెక్టర్, స్క్రూటినీ కమిటీకి స్పష్టం చేస్తూ న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఇటీవల ఉత్తర్వులు ఇచ్చారు. దళిత యువకులకు శిరోముండనం చేసిన ఘటనలో తూర్పుగోదావరిజిల్లా ద్రాక్షారామ పోలీసులు 1997లో ఎస్సీ, ఎస్టీ చట్టంతో పాటు ఇతర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో ప్రస్తుత వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మరికొందరిని నిందితులుగా పేర్కొన్నారు. అయితే బాధితులు కోటి చినరాజు, డి.వెంకటరమణ ఎస్సీ సామాజిక వర్గానికి చెందినవారు కాదని, తమ వాదనలు పరిగణలోకి తీసుకోకుండా 2019 జూన్ 11న జిల్లా కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని జీవరత్నం, మరో వ్యక్తి అదే ఏడాది జూన్ 25న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల ఇరు పక్షాలు తమ వాదనలు వినిపించాయి. వీటిని పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. చట్టనిబంధనల ప్రకారం బాధితులు ఫలానా కులంవారని ఆమోదించడమో లేదా తిరస్కరించడమో నిర్దిష్ట నిర్ణయం వెల్లడించాల్సిన బాధ్యత కలెక్టర్‌పై ఉందని గుర్తు చేశారు. బాధితుల కులధ్రువీకరణ ఉత్తర్వులను పరిశీలిస్తే.. యథాతథస్థితి పాటించాలని పేర్కొన్నారు తప్ప నిర్దిష్ట ఆదేశాలు ఇవ్వలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆ ఉత్తర్వులకు చట్టబద్ధత లేదని, వాటిని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. బాధితుల కులం విషయంలో లోతైన విచారణ జరిపి చట్టనిబంధనల మేరకు సహేతుకమైన సమయంలో ఉత్తర్వులివ్వాలని నిర్దేశించారు.

రత్నగిరిపై చాగంటి ప్రత్యేక పూజలు



చాగంటి కోటేశ్వరరావుకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న అధికారులు

అన్నవరం, జనవరి 1: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో సోమవారం నూతన ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త చాగంటి కోటేశ్వరరావు కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ పీఆర్వో కృష్ణారావు, పండితులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందించగా పీఆర్వో స్వామివారి ప్రసాదం, మెమెంటో అందజేశారు. నూతన సంవత్సరం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. సుమారు 25 వేల మంది దర్శించుకున్నారని అధికారులు చెప్పారు.

సిద్ధి వినాయకుని ఆలయానికి పోటెత్తిన భక్తులు



పుష్పాలంకరణలో స్వామి



స్వామివారిని దర్శించుకుంటున్న గిడుగు రుద్రరాజు

అయినవిల్లి, జనవరి 1: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి సిద్ధివినాయక ఆలయం నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. సోమవారం ఆంగ్ల సంవత్సరం ఆరంభం రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా తీర్చిదిద్దారు. పీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు సిద్ధి వినాయకుని దర్శించుకుని పూజలు నిర్వహించుకున్నారు. అర్చకులు, అధికారులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు.

స్నాతకోత్సవం నిర్వహణకు సన్నాహాలు



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

జేఎన్టీయూకే, జనవరి 1: కాకినాడ జేఎన్టీయూకే 10వ స్నాతకోత్సవం నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నామని ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. వర్సిటీ అకడమిక్, ఆడిట్ డైరెక్టర్, పీఆర్వో సీహెచ్ సాయిబాబు అధ్యక్షతన నిర్వహించిన విశ్వవిద్యాలయం 2024 నూతన క్యాలెండర్, డైరీ, న్యూస్ మ్యాగజైన్‌ల ఆవిష్కరణ కార్యక్రమంలో వీసీ ముఖ్య అతిథిగా, గౌరవ అతిథులుగా రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ ఎల్.సుమలత, ఓఎస్డీ కోటేశ్వరరావు, డీపీపీ వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అందరి సమష్టి కృషి, సహకారంతో యూనివర్సిటీకి న్యాక్ ఏ+ గ్రేడ్, యూసీఈకే కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు లభించిందన్నారు. క్యాంపస్‌లో చేపట్టిన రహదారులు, డ్రైన్లను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. యూసీఈకేలో బీటెక్ సీఎస్ఈ(ఏఐఎంఎల్) కోర్సు, ఎమ్మెస్సీలో డేటా సైన్స్ కోర్సు, ఎంబీఏలో హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సులను ప్రారంభించి విద్యార్థులకు ప్రవేశాలు కల్పించామన్నారు. అనంతరం క్యాలెండర్, డైరీ, న్యూస్ మ్యాగజైన్‌లను వీసీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు డైరెక్టర్లు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వ్యక్తి నిర్బంధంపై వివాదం

పోలీసులపై టీడీపీ ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆగ్రహం



పోలీసులను ప్రశ్నిస్తున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

పెదపూడి, జనవరి 1: పోలీసుస్టేషన్‌లో వ్యక్తిని నిర్బంధించడంపై వివాదం రాజుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా పెదపూడి మండలం గండ్రేడుకు చెందిన వైసీపీ నాయకుడు పెంకే ఏకాశి అనే వీర వెంకట సత్యనారాయణ గండ్రేడు సెంటర్ వద్ద పలావు సెంటర్ నడుపుతున్నాడు. వైసీపీ విజయానికి అన్ని విధాల కృషి చేసిన పెంకే ఏకాశి పార్టీలో పూర్తిగా నష్టపోయి తగిన గుర్తింపు లేక తన అనుచరులతో భారీ ఎత్తున టీడీపీలో చేరుటకు రంగం సిద్ధం చేసుకున్నారు. విషయం తెలిసిన గండ్రేడు సర్పంచ్ కురుపూడి మాధవీలత భర్త శ్రీనివాస్ అనుచరుడు పిల్లి వెంకట్ గత నెల 31 మధ్యాహ్నం పలావు సెంటర్ వద్ద పెంకే ఏకాశితో ఘర్షణకు దిగాడు. అదే రోజు సాయంత్రం పిల్లి వెంకట్ పలావు సెంటర్ వద్దకు వెళ్లి పెంకే ఏకాశిపై దాడి చేయడంతో గాయపడిన ఏకాశి వైద్యం నిమిత్తం అదే రోజు రాత్రి 8.30 నిమిషాల సమయంలో కాకినాడ జీజీహెచ్‌కు వెళ్లగా అక్కడ చికిత్స అనంతరం ఎమ్మెల్సీ నమోదు చేశారు. విచారణ నిమిత్తం పెంకే ఏకాశిని పెదపూడి పోలీసులు స్టేషన్‌కు పిలిచి అక్కడ ఉంచారు. వైసీపీ నుంచి వెళ్లిపోతున్నాడనే కక్షతో అధికార పార్టీ నాయకులు ఒత్తిడి మేరకు ఎంతకూ పోలీసులు తనను విడుదల చేయకపోవడంతో విషయాన్ని పెంకే ఏకాశి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి తెలిపారు. విషయం తెలుసుకున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఉదయం నుండి ఏకాశిని ఎందుకు నిర్బంధించారని ప్రశ్నించారు. గొడవపడ్డ ఇరుపార్టీలను స్టేషన్‌కు పిలిపించాలి కానీ ఒక్కరినే స్టేషన్‌కు పిలిచి నిర్బంధించడం ఏమిటని, నూతన సంవత్సరం సందర్భంగా అధికారులు అందుబాటులో ఉండరని తెలిసిన సమయంలో ఎందుకు ఏకాశిని స్టేషన్‌కు పిలిపించారని పోలీసులపై ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒత్తిళ్లకు తలొగ్గి విధులు నిర్వహిస్తే భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు. అప్పుడు ఒత్తిడి తెచ్చిన వారు మిమ్మల్ని ఆదుకోలేరన్నారు. సాక్షాత్తు నల్లమిల్లే పూచీకత్తు ఇస్తాననడంతో ఏకాశిని పోలీసులు విడుదల చేయడంతో వివాదం సద్దుమణిగింది.

రేపు అంతర్వేది ఫిషింగ్ హార్బర్‌కు

కేంద్రమంత్రి రాక

మత్స్యకారులతో సమావేశం

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించనున్న

కేంద్ర మంత్రి రూపాల పురషోత్తం

అంతర్వేది, జనవరి 1: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది మినీ ఫిషింగ్ హార్బరుకు ఫిషరీస్, యానిమల్ హస్బెండరీ, డైరింగ్‌శాఖ కేంద్ర మంత్రి రూపాల పురుషోత్తం బుధవారం విచ్చేస్తారు. మత్స్యకారులతో సమావేశమై కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తారని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్ తెలిపారు. ఈ సదస్సుకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ.వేమా, జిల్లా ఇన్‌చార్జి పొట్లూరి రామ్మోహనరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడబాల సత్యనారాయణ, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, రాష్ట్ర కిసాన్ మోర్చా డ్రైనేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు, పార్టీ మండల అధ్యక్షుడు పట్టాపు సూర్యప్రకాశరావు పాల్గొంటారు. కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి



తునిరూరల్, జనవరి 1: కాకినాడ జిల్లా తుని పట్టణంలో సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. తుని సీతారామపురానికి చెందిన పి.గణేష్ (28) పెట్రోల్ పోయించుకుని ఇంటికి వెళుతుండగా పట్టణంలోని ఎల్ఐసీ బిల్డింగ్ వద్ద లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనపై తుని పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

వైద్య విద్యార్థులకు తీవ్రగాయాలు

జీజీహెచ్ (కాకినాడ), జనవరి 1: కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ (పీజీ) చేస్తున్న ఇద్దరు వైద్య విద్యార్థులు సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాల పాలై కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. తమిళనాడుకు చెందిన 30 ఏళ్ల డా.అరుల్, 30 ఏళ్ల డా.అనుసత్య షణ్ముఖ సుందరన్ ఆర్ఎంసీలోని ఈఎన్‌టీ విభాగంలో మొదటి సంవత్సరం పీజీ వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. వారిద్దరు జీజీహెచ్‌కు ఎదురుగా ఉన్న పీజీ హాస్టల్‌లో ఉంటూ చదువులో భాగంగా జీజీహెచ్‌లో విధులు నిర్వర్తిస్తుంటారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి హాస్టల్ నుంచి విధులకు హాజరయ్యేందుకు బైక్‌పై జీజీహెచ్‌కు వెళ్లే క్రమంలో రోడ్డు దాటుతుండగా మెయిన్ రోడ్డు వైపు నుంచి జిల్లా పరిషత్ వైపు వేగంగా వెళుతున్న మరో బైక్ వీరి బైక్‌ను బలంగా ఢీ కొట్టింది. దాంతో వైద్య విద్యార్థులు ఇరువురు చెల్లా చెదురుగా పడి తీవ్రంగా గాయపడ్డారు. అది గమనించిన స్థానికులు క్షతగాత్రులను అత్యవసర విభాగానికి తరలించగా అక్కడ వైద్యులు పలు వైద్య పరీక్షలు నిర్వర్తించి వైద్య చికిత్సను అందజేస్తున్నారు. అరుల్‌కు ఎడమ మోకాలు భాగం విరిగి, పాదం భాగం లో కన్నం పడి తీవ్ర రక్త స్రావం అయింది. అలాగే అనుసత్యకు ముఖం భాగంలో తీవ్ర గాయాలు అవడంతో ఈఎన్‌టీ వైద్యులు ప్రత్యేక వైద్య చికిత్సను అందజేస్తున్నారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

పి.గన్నవరం, జనవరి1: ఎస్టీయూ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీ, ఫోన్‌బుక్స్, సీఎల్ పుస్తకాలను ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి ఆవిష్కరించారు. ఈనెల12,13తేదీల్లో కర్నూల్‌లో జరగబోయే వజ్రోత్సవ వేడుకలగోడపత్రికను ఆవిష్కరించారు. మండలస్థాయి అధికారులకు, నాయకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మండల గౌరవ అధ్యక్షుడు కత్తుల ఆనందరావు, నల్లా బాలాజీ, బళ్ళ శ్రీనివాసు, నీతిపూడి శ్రీనివాసరావు, ముద్రగళ్ళ జగదీశ్వరరావు, చిక్కం రవికుమార్, రాణి శేషగిరిరావు పాల్గొన్నారు.

● జిల్లాలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులకు నాయకులు, కార్యకర్తల నూతన సంవత్సర శుభాకాంక్షలు ● కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు






ఐ.పోలవరం: దాట్ల బుచ్చిబాబుకు సన్మానం, ద్రాక్షారామ: రెడ్డి సుబ్రహ్మణ్యం దంపతులకు సన్మానం, కొత్తపేట: కేక్ కట్ చేస్తున్న బండారు సత్యానందరావు, మండపేటలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

ఐ.పోలవరం, జనవరి 1: మండలంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. టీడీపీ క్యాంపు కార్యాలయం వద్దకు అధిక సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు చేరుకుని మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. కొమరగిరికి చెందిన టీడీపీ నాయకుడు గాదిరాజు బుచ్చికృష్ణంరాజు ఆధ్వర్యంలో గజమాలతో బుచ్చిబాబును సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, నాగిడి నాగేశ్వరరావు, మందాల గంగాసూర్యనారాయణ, సాగిరాజు సూరిబాబురాజు, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, దాట్ల పృథ్వీ, తాడి నరసింహారావు, గొలకోటి దొరబాబు, దాట్ల బాబు, పొద్దోకు నారాయణరావు, సాకా నీతాదేవి, చెల్లి అశోక్, అర్దాని శ్రీను, టేకుమూడి లక్ష్మణరావు, నడింపల్లి సుబ్బరాజు, చెయ్యేటి శ్రీనుబాబు, గంజా సుధాకర్, నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: నూతన సంవత్సర వేడుకలను సోమవారం ముమ్మిడివరంలో ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి బాణాసంచాలు కాల్చి యువత పెద్దఎత్తున నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్నారు. జనసేన పార్టీ కార్యాలయం వద్ద రాష్ట్ర పీఏసీ కమిటీ సభ్యుడు పితాని బాలకృష్ణ, నాయకుల, కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్‌ను కట్‌చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సానబోయిన మల్లికార్జునరావు, గుద్దటి జమి, గోదశి పుండరీష్, గిడ్డి రత్నశ్రీ, కడలి కొండ, జక్కంశెట్టి పండు, దూడల స్వామిలతో పాటు పలువురు పాల్గొన్నారు. మాజీ ఎంపీపీ పెన్మెత్స చిట్టిరాజు, నగర పంచాయతీ మాజీ చైర్మన్ చెల్లి శాంతకుమారి, అశోక్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావులు నూతన సంవత్సర వేడుకలను జరుపుకున్నారు. పలు ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు.

మలికిపురం: నూతన సంవత్సర వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు ఇంటి వద్ద కత్తిమండలో అభిమానులు, నియోజకవర్గ నాయకులు, అధికారులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి మనోహర్‌లు, దొమ్మేటి ఉమా, శ్రీనివాస్, కడలి మధు, కేఎస్ఎన్ రాజు, మలికిపురం సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి తులసీభాస్కర్ ఉన్నారు. జనసేన నాయకుడు బొంతు రాజేశ్వరరావును మలికిపురంలో ఆయన ఇంటి వద్ద జనసేన, టీడీపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో మల్లిపూడి సత్తిబాబు, సుందర బుల్లబ్బులు, వీరా వెంకట్, అల్లూరి రంగరాజు, మేకల ఏసుబాబు, దేవ రాజు తదితరులు ఉన్నారు. మలికిపురంలో జనసేన సమన్వయ కర్త గుండుబోగుల పెదకాపును, వైసీపీ నాయకుడు కేఎస్ఎన్ రాజును, మలికిపురం సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి తులసీభాస్కర్‌లను వారి అభిమానులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

అంబాజీపేట: నూతన సంవత్సరం వేడుకలను సోమవారం ఆనందోత్సవాలనడుమ అధికారులు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ బూడిద వరలక్ష్మిలకు పలువురు నాయకులు, అధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీడీవో కె.సత్యనారాయణమూర్తి, ఈవోపీర్డీ మమతలకు ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, ఉపాధి హామీ క్షేత్రసహాయకులు శుభాకాంక్షలు తెలిపారు. వైద్యాధికారులకు ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ ఏ.చైతన్యకుమార్‌కు పోలీస్ సిబ్బంది నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవోలు వెంకటేశ్వరరావు, ఎం.ప్రకాష్, ఎస్టీయూ, యూటీఎఫ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: పి.గన్నవరంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంపీడీవో ఎం.భారతీ, ఎస్ఐ హరికోటి శాస్త్రి, లంకలగన్నవరంలో టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, పోతవరంలో నగరం మార్కెట్ కమిటీ చైర్మన్ నక్కా కృష్ణవేణిలకు పలువురు అధికారులు, నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు, పండ్లు అందించి శుభాకాంక్షలు తెలిపారు. బెల్లంపూడి మత్తయి లూథరన్‌చర్చి వద్ద ఫాదర్ ఎస్.ఏసుపాదం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. మండలంలోని పలు గ్రామాల్లో చర్చిలు వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఆత్రేయపురం: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కుండా అన్నపూర్ణ, ఎంపీడీవో నాతి బుజ్జి కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బంది నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అధికార, ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల ఇళ్ల వద్ద అభిమానులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

రావులపాలెం: గోపాలపురంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి నివాసానికి వైసీపీ శ్రేణులు, అభిమానులు వెళ్లి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. వారందరికీ ఆయన భోజన ఏర్పాట్లు చేశారు. గ్రామాల్లో అందరూ ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

మామిడికుదురు: నూతన సంవత్సర వేడుకలను మామిడికుదురులో ఘనంగా నిర్వహించారు. వివిధ మండలాలకు చెందిన నాయకులు, అధికారులు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబును కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. యువకులు, విద్యార్థులు వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. వివిధ శాఖల అధికారులకు కిందిస్థాయి ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

అల్లవరం: ఎంపీ చింతా అనురాధ స్వగృహం మొగళ్లమూరులో, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఇంటి వద్ద నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు శుభాకాంక్షలు తెలిపారు. డీఆర్వో సత్తిబాబు, అమలాపురం, కొత్తపేట ఆర్డీవోలు జి.కేశవర్ధనరెడ్డి, ఎం.ము క్కంటి, వ్యవసాయశాఖ జేడీ బోసుబాబు, పీఆర్ డీఈఈలు అన్యం రాంబాబు, పీఎస్ రాజకుమార్, ఆర్అండ్‌బీ డీఈ రాఘవ, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జడ్పీటీసీలు కొనుకు గౌతమి, గెడ్డం సంపదరావు, రాష్ట్ర అగ్రిమిషన్ సభ్యుడు జిన్నూరి రామారావు, సాధనాల వెంకట్రావు, తిక్కా వెంకటప్రసాద్, ఎంపీడీవో కృష్ణమోహన్, తహసీల్దారు ఎన్ఎస్ఎస్ ప్రసాద్, వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్‌వలీ, పోలీసులు, ప్రజాప్రతినిధులు ఎంపీ, ఎమ్మెల్సీలకు నూతనసంవత్సర శుభాకాంక్షలు చెప్పారు.

రాజోలు: మండలంలోని గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలు ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. తాటిపాకలో మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు స్వగృహం వద్ద రాజోలు నియోజకవర్గం టీడీపీ, నాయకులు, కార్యకర్తలు సోమవారం నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. చింతలపల్లిలో డిప్యూటీ మాజీ స్పీకర్ అల్లూరి వెంకటసూర్యనారాయణరాజు స్వగృహం వద్ద ఘనంగా వేడుకలు నిర్వహించారు. తాటిపాకలో గొల్లపల్లి భారీ కేక్‌ను కట్‌చేసి నాయకులు, కార్యకర్తలకు పంచారు. నియోజకవర్గ కార్యకర్తలతో పాటు జిల్లా నలుమూలల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి మాజీ మంత్రి గొల్లపల్లి, సతీమణి లూథియమ్మ దంపతులకు, యువ నాయకుడు గొల్లపల్లి శ్రీధర్‌బాబులకు గజమాల వేసి, కేక్ కట్‌చేయించి, దుశ్శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చిటికెల రామ్మోహనరావు, ఎంపీపీ కేతా శ్రీనివాస్, దంతులూరి రామకృష్ణంరాజు, మంగెన భూదేవి, బందెల పద్మ, కాండ్రేగుల భవానీ, రాజోలు, మామిడికుదురు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల టీడీపీ అధ్యక్షులు గుబ్బల శ్రీనివాస్, మొల్లేటి శ్రీనివాస్, అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, నాగిరెడ్డి గోపి, పితాని సూరిబాబు, గాలిదేవర వెంకన్నబాబు, అడబాల సాయిబాబు, తాడి సత్యనారాయణ, చిట్టూరి సంతోష్, అడబాల సత్యరమేష్ పాల్గొన్నారు.




రాజోలు: గొల్లపల్లి సూర్యారావు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం యానాం: ఎమ్మెల్యే గొల్లపల్లి అశోక్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్‌ఏ తదితరులు

ద్రాక్షారామ: చోడవరంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం నివాసంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. రెడ్డి సుబ్రహ్మణ్యం, పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారిలను టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సుబ్రహ్మణ్యం దంపతులను అభిమానులు భారీ గజమాలతో సత్కరించారు. సుబ్రహ్మణ్యం దంపతులు కేకు కట్ చేశారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు కడియాలరాఘవన్, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, టీడీపీ నాయకులు రాయపురెడ్డి రాజా, కొసనా శ్రీనివాస్, కాళ్ల సత్యనారాయణ వేడుకల్లో పాల్గొన్నారు. హసన్‌బాదలో రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఆయన కుమారుడు సూర్యప్రకాష్‌లను అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు, పూలమాలలతో సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ద్రాక్షారామ భీమేశ్వరాలయ ఈవో పి.టి.వినత్యనారాయణ ఆధ్వర్యంలో అర్చకులు బోస్, సూర్యప్రకాష్ కుటుంబీకులకు వేదాశీర్వచనం అందజేశారు. జడ్పీటీసీ సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవానీ, ఏపీఐడీసీ డైరెక్టరు శ్యామ్, ఏపీఈఐడీసీ డైరెక్టరు టేకుమూడి సుజాతలకు పలువురు నూతనసంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఉప్పలగుప్తం: పెద్దూరు ఆర్సీఎం చర్చిలో పినిపే జయరాజ్ ఆధ్వర్యంలో శాంతి ప్రార్థనలు నిర్వహించారు. వివిధ గ్రామాల్లోని చర్చిల్లో గుడ్‌సీడ్ ఫౌండేషన్ అధ్యక్షుడు కుంచే రమణారావు ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. మంత్రి పినిపే విశ్వరూప్‌ను పొగాకు శ్రీనుతో పాటు పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ అమలాపురం అసెంబ్లీ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావుకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అరిగెల నానాజీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు.

కొత్తపేట: వాడపాలెంలోని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నివాసానికి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలి వచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి, మందపల్లి మందేశ్వరస్వామి, పలివెల ఉమాకొప్పేశ్వరస్వామి దేవస్థానాల వేద పండితులు వచ్చి సత్యానందరావు కుటుంబ సభ్యులకు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ఆయన భారీ కేక్ కట్ చేసి వచ్చిన వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముత్యాల బాబ్జీ కంఠంశెట్టి శ్రీనివాస్, బండారు వెంకట సత్తిబాబు, గుబ్బల మూర్తి, బీర ఇసాక్, బూసి జయలక్ష్మి, భాస్కరరావు, బండారు వీరబాబు, చిక్కం హనుమంతు, బండారు వీరన్నకాపు, పప్పుల కొత్తయ్య, త్సామా బాబు, సలాది నాగేశ్వరరావు, జన సైనికులు పాల్గొన్నారు.

యానాం: నూతన సంవత్సర వేడుకలను యానాంలో కోలహలంగా జరుపుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి యువకులు, విందువినోదాలతో పలు కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, పరిపాలనాధికారి ఆర్.మునిస్వామిలకు అధికారులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఉన్నతాధికారులకు సంబంధిత శాఖల సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. నియోజవర్గంలోని పలు పార్టీ కార్యాలయాల్లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్ఆర్ కాంగ్రెస్, బీజేపీ, అన్నాడీఎంకే, కాంగ్రెస్ కార్యాలయాల్లో అభిమానులు కేక్‌లను కట్‌చేశారు. అభిమానులకు స్వీట్లు, పండ్లు పంచారు. స్థానిక వృద్ధాశ్రమంలో వృద్ధులకు పరిపాలనాధికారి మునిస్వామి పండ్లు, స్వీట్లు పంచారు.

కె.గంగవరం: మండలంలో ప్రజలు సోమవారం న్యూఇయర్ వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. గ్రామాల్లో మహిళలు రంగురంగుల రంగవల్లులతో 2024కు స్వాగతం పలికారు. యువకులు న్యూఇయర్ కేక్ కట్ చేసి పండుగ జరుపుకున్నారు. ప్రజలు ఆలయాలక వెళ్లి పూజలు చేశారు. యండగండి, పామర్రు, దంగేరు, అముజూరు, కోటిపల్లి, దంగేరు, మసకపల్లి గ్రామాల్లో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

మండపేట: స్థానిక కేపీ రోడ్డులో ఉన్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఇంటి వద్ద పార్టీ శ్రేణులు, ఏర్పాటు చేసిన కేక్‌ను కట్‌చేసి,అభిమానులు బహూకరించిన కిరీటాన్ని ధరించి వేడుకల్లో పాల్గొన్నారు. నియోజకవర్గ పరిధిలో గ్రామాల నుంచి తరలివచ్చి అభిమానులు, పార్టీ శ్రేణులతో వేగుళ్ల ఇల్లు కిటకిటలాడింది. వేగుళ్లను టీడీపీ ప్రజాప్రతినిధులు, నేతలు అధికారులు కలిసి నూతనసంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక సూర్యకన్వెన్షన్ హాల్‌లో జరిగిన నూతనసంవత్సర వేడుకల్లో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుపాల్గొన్నారు. తోటను పార్టీ శ్రేణులు, అధికారులు, అభిమానులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కామన ప్రభాకరరావు పాల్గొన్నారు.పార్టీ నేతలు, అభిమానులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.స్థానిక ఏడిద రోడ్డులో పార్టీ నూతన కార్యాలయాన్ని సోమవారం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ ప్రారంభించారు. పార్టీ కార్యాలయానికి నియోజకవర్గం నలుమూలల నుంచి పార్టీ శ్రేణులు, అభిమానులు, జనసైనికులు తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ ఉండమట్ల వాసు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు.పార్టీ శ్రేణులు, అభిమానులు కలిసి న్యూఇయర్ శుభాకాంక్షలు తెలిపారు.

రామచంద్రపురం: మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ స్వగృహంలో కేక్ కట్ చేశారు. అభిమానులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ స్థానిక పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అభిమానులు, కార్యకర్తలకు స్వీట్లు పంచారు. జనసేన పార్టీ టికెట్ ఆశిస్తున్న నాయకులు చిక్కాల దొరబాబు స్థానిక కోర్టు వీధిలో నూతనంగా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయనను అభిమానులు గజమాలతో సత్కరించారు. కేక్ కట్ చేసి అభిమానులకు స్వీట్లు పంచారు. పట్టణంలో ప్రజలు ఆలయాలను దర్శించి పూజలు నిర్వహించారు.

21వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె



రామచంద్రపురంలో కబడ్డీ ఆడుతున్న అంగన్‌వాడీలు

ముమ్మిడివరం, జనవరి 1: అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె సోమవారం 21వ రోజుకు చేరుకుంది. ముమ్మిడివరం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలు, కార్యకర్తలు, ఆయాలు ఎర్ర చీరలు కట్టుకుని సీఎం జగన్ మనసు మార్చాలని ఏసుక్రీస్తును కోరుతూ ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక భజన కార్యక్రమంలో నిరసన తెలిపారు. ఇన్ని రోజుల నుంచి సమ్మె చేస్తున్నా మా ఆక్రందన, ఆవేదన వినబడడం లేదా జగనన్న అంటూ, మా జీతాలు పెంపు చేయకపోతే ఎన్నికల్లో మేము నొక్కే బటన్‌లు నొక్కుతామంటూ హెచ్చరిస్తూ పాటలు పాడుతూ భజనలుచేశారు. ఎస్.దుర్గామహేశ్వరి, ఎం.జయలక్ష్మి, తలుపులమ్మ, సుబ్బలక్ష్మి, శ్రీదేవి, విజయ, జి.అనంతలక్ష్మి, ఎం.అరుణ, కె.కనకదుర్గ, కె.ధనలక్ష్మి, శైలజ, వనమాలి యశోధ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మలికిపురం: అంగన్‌వాడీల సమ్మె సోమవారం 21వ రోజుకు చేరింది. ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో అంగన్‌వాడీలు సమ్మెను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే తమ జీతాలు పెంచాలని, గ్రాట్యుటీ ఇవ్వాలని, పింఛన్ సౌకర్యం కల్పించాలని అంగన్‌వాడీ నాయకులు కోరారు. సుజాత, కేజీ రత్నకుమారి, జ్యోతి, శేషవేణి, నాగమ్మ, నందిని, పద్మావతి తదితరులు ఉన్నారు.

మామిడికుదురు: అంగన్‌వాడీలు నూతన సంవత్సరం తొలి రోజు సోమవారం వినూత్న నిరసన ప్రదర్శన చేశారు. ప్రభుత్వం తమకు పంపిణీ చేసిన ఫోను, చీరలకు బొట్టు, పూలు, గాజులు పెట్టి పూజలు చేశారు. డిమాండ్ల పరిష్కారం కోసం దీక్షలు చేస్తుంటే ప్రభుత్వం కనీసం పట్టనట్టు వ్యవహరిస్తుందని ఆరోపించారు. వెంటనే తమ న్యాయమైన డిమాండ్లు పరి ష్కరించాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

రామచంద్రపురం: అంగన్వాడీలు సోమవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. రోడ్డుపై కబడ్డీ ఆడి నిరసన తెలిపారు. దేశభక్తి, విప్లవ గీతాలకు డ్యాన్స్ వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా అంగన్వాడీ యూనియన్ నాయకురాలు మేడిశెట్టి దుర్గ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బలరాం మాట్లాడుతూ 21రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి చలనం లేకుండా పోయిందని, నూతన సంవత్సరంలో శుభవార్త చెబుతారనుకుంటే ప్రభుత్వం మొండి వైఖరి చూపడం బాధాకరమైన విషయమన్నారు. శిబిరానికి మీడియా మిత్రులు రాజు, బాటసారి సత్యనారాయణ, క్వారీ లారీ వర్కర్స్ యూనియన్ నాయకులు సతీష్, నాగరాజు, శంకర్, దొరబాబు, కాంగ్రెస్, టీడీపీ మహిళా నాయకురాళ్లు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో రెండు మండలాల అంగన్వాడీలు పాల్గొన్నారు.

బీమా కోరేగావ్ విజయోత్సవ వేడుకలు

ముమ్మిడివరం, జనవరి 1: బీమా నది ఒడ్డున జరిగిన భీకర యుద్ధంలో మహర్ సైనికులు పీష్వా బ్రాహ్మణులను ఓడించి చరిత్ర గతిని మార్చిన బీమాకోరేగావ్ యుద్ధం బహుజన పోరాటాలకు స్ఫూర్తి అని రిపబ్లికన్ రాష్ట్ర నాయకుడు పి.సుధీర్ పేర్కొన్నారు. స్థానిక బుద్ధా పార్కులో సోమవారం చీకురుమెల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 206వ బీమా కోరేగావ్ విజయోత్సవాలు జరుపుకున్నారు.అంబేడ్కర్, బీమా కోరేగావ్ స్థూపం, చిత్రపటాలకు నివాళులర్పించారు. మట్టా సిద్ధార్థగౌతమ్, ఈవీవీ సత్యనారాయణ, దోనిపాటి అంజనేయులు, సకిలే పృథ్వీరాజ్, బి.శరత్, కాశి సత్యనారాయణ మూర్తి, దేవరపల్లి ఏడుకొండలు, అయితాబత్తుల పండు, మట్టా శ్రీనివాసరావు, చీకురుమల్లి చిరంజీవి పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జిల్లాశాఖ అధ్యక్షుడు గిడ్డి జ్ఞానప్రకాష్ అధ్యక్షతన బీమ్‌కోరేగావ్ మృతవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ప్రకాష్ అధ్యక్షతన అమలాపురం సావరం రోడ్డులో ఆర్పీఐ నాయకుల సమావేశం సోమవారం నిర్వహించారు. ప్రాణాలను లెక్కచేయకుండా పోరాడిన మెహర్‌లకు ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎం రుషి, బడుగు సత్యనారాయణ, దడాల రామకృష్ణ, బళ్ల సత్యనారాయణ, చీకురుమెల్లి కృష్ణమూర్తి, పరమట నాగరాజు పాల్గొన్నారు.

చంద్రబాబు ఆదేశిస్తే పోటీకి సిద్ధం: సత్యశ్రీ



ఉప్పలగుప్తం, జనవరి 1: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ఆదేశిస్తే తాను ఎమ్మెల్యే, ఎంపీ స్థానాల్లో ఎక్కడి నుంచైనా పోటీకి సిద్ధమని అమలాపురం మాజీ ఎంపీ ఏజేవీబీ మహేశ్వర రావు కుమార్తె, ఇటీవల ఆ పార్టీలో చేరిన పాము సత్యశ్రీ అన్నారు. సోమవారం ఆమె తండ్రితో కలిసి బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం గోపవరంలో విలేకరులతో మాట్లాడారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా పనిచేసిన తన తండ్రి ద్వారా రాజకీయాలను అవగాహన చేసుకున్నానన్నారు. ఆయన రాజకీయ వారసురాలిగా చంద్రబాబు ఆశయ సిద్ధికి కృషి చేస్తానని వివరించారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు టీడీపీ చేస్తున్న నిర్మాణాత్మక కృషికి స్పందించి ఆ పార్టీలో చేరినట్టు చెప్పారు.

సమస్యలపై మంత్రికి వినతి

అమలాపురం టౌన్, జనవరి 1: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన అనంతరం పీఆర్సీ ప్రకారం అమలులోఉన్న గ్రాడ్యుటీ అమౌంట్ రూ.16 లక్షలకు ఉన్నసీలింగ్ పరిమితిని రద్దుచేసి 2022లో ఇచ్చిన జీవోను అమలు చేయాలని కోరుతూ ఏపీపీటీడీ ఆఫీసర్స్ అసోసియేషన్ తరుపున జిల్లా ప్రజారవాణాధికారి ఆర్వీఎస్ నాగేశ్వరరావు సోమవారం మంత్రి పినిపే విశ్వరూప్‌కు భట్నవిల్లిలోని క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

ఖ్వాజాబాబా ఉరుసు ఉత్సవాలు

అమలాపురం టౌన్, జనవరి 1: అమలాపురం ముస్లిం వీధిలో ఉన్న దర్గా నుంచి సోమవారం హజరత్ ఖ్వాజాబాబా ఉరుసు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గుర్రంపై గంధం తీసుకుని ఫకీరు వాయిద్యాలతో పట్టణంలో ఊరేగింపు నిర్వహించి దర్గాకు చేరుకున్నారు. బాబా సమాధిపై గంధంపూసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నాయకులు మహ్మద్ ఆజామ్, మహ్మద్ అమీర్, వలీ, బాషాజాన్, ఎండీ ఖాదర్‌వలీ, బషీర్, సాజిద్‌హజారీ, షఫిపాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం


వెంకటరామ	: హాయ్‌నాన్న
వెంకటరమణ	: డెవిల్
శ్రీలలిత	: బబుల్‌గమ్
శేఖర్ స్ర్కీన్-1	: సలార్
శేఖర్ స్ర్కీన్-2	: డంకీ
రమా	: డెవిల్
గణపతి	: యానిమల్
వెంకటపద్మావతిస్ర్కీన్-1	: సలార్
వెంకటపద్మావతి స్ర్కీన్-2	: సలార్

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

అంతర్వేది, జనవరి 1: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామిని నూతన సంవత్సరం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. సోమవారం ఉదయం నుంచి స్వామివారి పుణ్యక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. స్వామి-అమ్మవార్లకు నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేకంగా అలంకరణ చేశారు. బేడ మండపంలో ఉన్న రాజ్యలక్ష్మిఅమ్మవారినిపూలతో అలంకరించారు.

ఐ.పోలవరం: మురమళ్ళ వీరేశ్వరస్వామి ఆలయంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆయనకు ఆలయ చైర్మన్ పెన్మెత్స వాసురాజు, ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణ ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనం అనంతరం అర్చకులు, పురోహితులు, వేదపండితులు వేదఆశీర్వాచనం చేశారు. పట్టు వస్త్రాలతో సత్కరించి స్వామి చిత్రపటాన్ని అందించారు. సర్పంచ్ కాలే రాజబాబు, తహసీల్దార్ పాల్గొన్నారు.

ద్రాక్షారామ: ద్రాక్షారామ భీమేశ్వరాలయం భక్తుల రద్దీ నెలకొంది. మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ భీమేశ్వరస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవదాయ శాఖ జిలా సహాయ కమిషనరు కె.ఎస్.వి.డి.వి.ప్రసాద్, తనిఖీదారు బాలాజీ రామ్ ప్రసాద్ పలువురు అధికారుల స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



రాయవరం: వెదురుపాక విజయదుర్గాపీఠంలో ఆంగ్ల నూతన సంవత్సరం పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే అమ్మవారికి పంచద్రవ్యాలతో అభిషేకాలు, విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ జరిపి లలితాఅష్టోత్తర, సహస్రనామాలు, దుర్గా, లక్ష్మి, సరస్వతి అష్టోత్తరాలతో కుంకుమ పూజలు జరిపారు. అమ్మవార్ని దర్శించిన భక్తులు పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందారు. ఈసందర్భంగా పీఠాధిపతి గాడ్ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.పీఠాధిపతి గాడ్ మాట్లాడుతూ దైవారాధన వల్ల కష్టాలు తొలగి సకల శుభాలు కలుగుతాయన్నారు. కార్యక్రమంలో అడ్మినిస్ర్టేటర్ వీవీ బాపిరాజు, పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్(బాబి), గాడ్‌కుమార్తెలు సత్యవెంకట కామేశ్వరి, భాస్కరనారాయణ, పెద్దపాటి సత్యకనకదుర్గ(శ్రీనివాసమూర్తి, బలిజేపల్లి రమా, భక్తులు పాల్గొన్నారు. మండలంలోని దుర్గాదేవి, శివాలయాలు, వైష్ణవాలయాలు, వినాయకుడి ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.

నూతన సంవత్సరానికి స్వాగతం..

అమలాపురం టౌన్, జనవరి 1: నూతన సంవత్సరానికి స్వాగతం పలు కుతూ క్రైస్తవ ప్రార్థనా మందిరాల్లో ఆదివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అమలాపురం సినిమా రోడ్డులోని సెయింట్ లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. స్థానిక నల్ల వంతెన దిగువన ఉన్న మన్నా జూబ్లీ చర్చిలో రెవ.కార్లడేవిడ్‌కొమానపల్లి ఆధ్వర్యంలో ఆదివారం అర్ధరాత్రి నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. యవ్వనస్తుల నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో ఎర్నెస్ట్ తాతపూడి, ఎస్తేరుజ్యోతి తాతపూడి, షారోన్ రోజ్, తదితరులు పాల్గొన్నారు. ఆరాధనల అనంతరం విందు భోజనాలు ఏర్పాటు చేశారు.

వైభవంగా శివకేశవుల గ్రామోత్సవం

అంబాజీపేట, జనవరి 1: ధనుర్మాసం ఉత్సవాల్లో భాగంగా గంగలకుర్రు అగ్రహారంలో వేంచేసియున్న శ్రీఉమాపార్వతీ సమేత వీరేశ్వరస్వామి, శ్రీదేవి, శ్రీభూదేవి సమేత కేశవస్వామి వార్ల గ్రామోత్సవం సోమవారం గ్రామయువకుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయంలో స్వామివార్లకుప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన సంవత్సరం సందర్భంగా మండలంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. మాచవరం దొమ్మేటివారిపాలెంలో భవానీల 54కలశల పూజ నిర్వహించారు. దొమ్మేటిసత్యమోహన్-సత్యకుమారి దంపతులు ఆధ్వర్యంలో గణపతి హోమం, చండీహోమం, అభిషేకాలు, కుంకమపూజ నిర్వహించారు. రాత్రి నిప్పుల గుండం కార్యక్రమం నిర్వహించారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసన



ముమ్మిడివరంలో ఒంటి కాలిపై నిరసన తెలుపుతున్న మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు

ముమ్మిడివరం, జనవరి 1: నగర పంచాయతీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చేస్తున్న సమ్మె సోమవారం నాటికి 7వ రోజుకు చేరుకుంది. నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ఏర్పాటుచేసిన దీక్షా శిబిరంలో నగర పంచాయతీ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఒంటి కాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి తమకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండు చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్‌లు శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. దీక్షా శిబిరంలో ఎం.శ్రీనివాసరావు, ఎస్.అరుణ్‌కుమార్, ఎస్.అజయ్‌కుమార్, వి.వెంకటేశ్వర్లు, ఎస్.వెంకటేష్, వై.రమణ, కాశి జార్జి, జి.రమేష్, ఎ.సత్తిబాబు, ఎస్.రామరాజు, బి.రమణమ్మ, మహాలక్ష్మి, ఎస్.బుజ్జమ్మలతో పాటు పలువురు పాల్గొన్నారు. వీరంతా రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను కలిసి డిమాండ్లు పరిష్కరించాలని వినతిపత్రం అందించారు.

మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమ్మె

మండపేట: మున్సిపల్ ఒప్పంద పారిశుధ్య కార్మికుల సమ్మె సోమవారం కొనసాగింది. నూతన సంవత్సర వేడుకలు వేళకూడా సమస్యలు పట్టించుకోకపోవడంపై ప్రభుత్వ తీరును తప్పుపట్టారు. కార్మికులు ఆకలి కేకలు వేస్తుంటే అధికార పార్టీ మాత్రం నూతన వేడుకలు జరుపుకోవడంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీక్షల్లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.కృష్ణవేణి, బంగారు కొండ, కొమరపు నరేంద్రకుమార్, బంగారు రాజుపాల్గొన్నారు.

అమలాపురం టౌన్: అమలాపురంమున్సిపల్ పారిశుధ్య కార్మికులు సోమవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమానవేతనం చెల్లించాలన్న ప్రధాన డిమాండ్లతో సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట తెల్లవారుజాము నుంచి కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా నాయకుడు గుదే దుర్గాప్రసాద్, కె.వెంకటేశ్వరరావులు సంఘీభావం తెలిపారు. తొమ్మండ్రు గోపీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మెలో పాప గంటి కోటేశ్వరరావు, మూర్తి,శ్రీను, ప్రసాద్, బాబి, అప్పారావు, జి.వరలక్ష్మి, తలుపులమ్మ, అనంతలక్ష్మి, లీలావతి, సుశీల పాల్గొన్నారు.

రామచంద్రపురం: సీఐటీయూ కార్యదర్శి నూకల బలరాం, గొరిపర్తి నాగభూషణం 6వరోజు సోమవారం మున్సిపల్ కార్మికులసమ్మె శిబిరాన్ని ప్రారంభించారు. లారీ వర్కర్స్ యూనియన్ నాయకులు సతీష్, నాగరాజు, శంకర్‌లు శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఎన్నోఏళ్లుగా సేవలు అందిస్తున్న కార్మికుల సమస్యలు ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలన్నారు. సమ్మెలో పిల్లి వెంకట్రావు, గుత్తుల తాతారావు, మేడిశెట్టి నాగబాబు, భీమశంకర్, ముత్యాల నాగరాజు, చిన్న అప్పారావు, వినోద్, కార్మికులు పాల్గొన్నారు.

ఇంటింటికి అయోధ్య రాముని అక్షింతలు

అయినవిల్లి, జనవరి 1: లోక కల్యాణార్థం ప్రతీ ఇంటికీ అయోధ్య రామయ్య అక్షింతలను చేరుస్తున్నట్టు బీజేపీ కిసాన్‌మోర్చా మండలశాఖ అధ్యక్షుడు వేటుకూరి శ్రీనివాసరాజు పేర్కొన్నారు. సోమవారం మాగాం గ్రామంలో నియోజకవర్గ కన్వీనర్ చీకురుమెల్లి వెంకటేశ్వరరావుతో కలిసి అక్షింతలను ఇంటింటికీ పంచారు. అయోధ్య శ్రీరామ తీర్థ ట్రస్టు బోర్డు ఆధ్వర్యంలో ఈనెల15 వరకు ప్రతీ ఇంటికీ శ్రీరాముని అక్షింతలను పంపిణీ చేస్తామన్నారు. విశ్వహిందూ పరిషత్ నాయకులు టి.వెంకటేశ్వరరావు, కుడుపూడి చంద్రశేఖర్, కొపనాతి శ్రీరామచంద్రమూర్తి, పసలపూడి శ్రీనివాస్, యనమదల వెంకటరమణ, రాజేష్ తదితరులు గ్రామోత్సవంలో పాల్గొన్నారు.

మామిడికుదురు: అయోధ్య నుంచి తీసుకువచ్చిన అక్షింతలను గ్రామాల్లో ఊరేగించి ప్రజలకు వితరణ చేస్తున్నారు. సోమవారం మాకనపాలెం గ్రామంలో ఇంటింటికీ తిరిగి అక్షింతలను పంపిణీ చేశారు. రుద్ర శ్రీనివాస్, మద్దాల ఆదిశేషు, గెద్దాడ జానకీరామ్, కానేటి వెంకన్న, మద్దాల బాబ్జి పాల్గొన్నారు.

రావులపాలెం: అయోధ్య రామయ్య పూజ అక్షింతలు నాలుగు రోజుల క్రితం రావులపాలెం మండలానికి చేరుకున్నాయి. ఇందులో భాగంగా సోమవారం ముమ్మిడివరప్పాడు గ్రామంలో చిన్నారులు కోలాటం చేస్తుంటే వెనుక భక్తులు ఇంటింటికీ వెళ్లి రాములవారి అక్షింతలను అందజేశారు.

రాజోలు: సోంపల్లిలో అయోధ్య నుంచి వచ్చిన బాలరాముడి అక్షింతలను లోక కల్యాణం కోసం అక్కినేని సుబ్రహ్మణ్యం, జొన్నలగడ్డ గోపాలకృష్ణల ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటికీ పంచారు. ఐదు శతాబ్దాల క్రితం కూల్చిన ఆలయాన్ని తిరిగి పునర్నిర్మించారని, ఈనెల22న ఆలయాన్ని ప్రారంభిస్తారన్నారు. ఆ రోజు హిందువులు, రామభక్తులు ప్రతీఇంటిలో పూజలు నిర్వహించి సాయంత్రం ఇంటిముందు దీపాలు వెలిగించాలన్నారు. మట్టపర్తి భాను, ఉండవల్లి బాబులు, యార్లగడ్డ బాబూరావు, బోళ్ల గంగరాజు, జోగారావు పాల్గొన్నారు.

అంతర్వేది: సఖినేటిపల్లి మండలంలో మూడు రోజుల పాటు పూజలు, భజనలు చేసిన అయోధ్య రాముని అక్షింతలను సోమవారం ఇంటింటికీ పంచేందుకు విశ్వహిందూ పరిషత్ సభ్యులు సిద్ధమయ్యారు. అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామ మందిర ప్రతిష్ఠా మహోత్సవం పురస్కరించుకుని బాలరామునికి పూజ చేసిన అక్షింతలు, ఆలయ ఫొటో, ఆహ్వాన పత్రాలు ప్రతీ గ్రామంలో ఇంటికీ పంపిణీ చేశారు. ఈఅక్షింతలు పూజా మందిరంలో ఉంచుకుని ఈనెల22న ప్రాణప్రతిష్ఠ సమయంలో శిరస్సున ధరించాలి. కార్యక్రమంలో బెల్లంకొండ రామకృష్ణ(నాని), బెల్లంకొండ స్వామితాత, లక్కు మణికంఠ, బెల్లంకొండ నాగు, పోతురాజు వాసు, పోతురాజు శ్రీవెంకటకృష్ణ, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తాపీమేస్త్రీల నూతన కార్యవర్గం ఎన్నిక

అంతర్వేది, జనవరి 1: సఖినేటిపల్లి మండలం ముత్యాలమ్మవారి తాపీ మేస్త్రీల సంఘ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా అంతర్వేది గ్రామానికి చెందిన తోట వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా గంటా శ్రీను(అప్పనరామునిలంక), కార్యదర్శులుగా కొండేటి సత్తిబాబు, యాళ్ల నాగరాజు, కోశాధికారిగా నాయుడు మురళీలను ఎన్నుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో వెనుకబడిన తాపీమేస్త్రీల కుటుంబాలకు ఆర్థికసాయం అందించారు. పనులు జరుగుతున్నప్పుడు ప్రమాదాలు సంభవించినా, ఇబ్బందులు ఎదురైనా ముత్యాలమ్మవారి తాపీమేస్త్రీల సంఘం ఆదుకోవడంలో ముందు ఉంటుందని అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో తాపీమేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.